

ప్రశాంతంగా లాసెట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్ష లాసెట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్ రావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 250 మందికి గాను 205 మంది పరీక్షకు హాజరు అయినట్టు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈపరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ ప్రతినిధులు పరీక్షా నిర్వాహణను పర్యవేక్షించారు.


పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఓఅండ్ఎం పనులు హుళక్కేనా..!

శిథిలావస్థలో లాకులు, షట్టర్లు.. ఆందోళనలో రైతులు

ముందస్తు సాగు పేరుతో జూన్ 1న ప్రభుత్వం కాలువలకు నీటిని విడుదల చేసింది. అయితే కాలువలు మూసివేసిన అనంతరం చేపట్టాల్సిన ఆధునికీకరణ పనులు గత ఐదేళ్లుగా అతీగతీ లేని సంగతి అందరికీ తెలిసిందే. అయితే కాలువలకు నీటిని విడుదల చేశాక హడావుడీగా తూడు, గుర్రపు డెక్క, చెత్తాచెదారం, తొలగింపు పనులు చేపట్టి చేతులు దులుపుకోవడం సర్వసాధారణమైంది. అయితే ఈసారి ఎన్నికల కోడ్ పేరుతో ఆ పనులకు ప్రభుత్వం ఎగనామం పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో కాలువలకు నీరు విడుదల చేసి పది రోజులు అవుతున్నా శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.


బీటలువారిన మెండి డ్యామ్

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టాలో నీటిపారుదల వ్యవస్థలో ఎంతో కీలకమైన లాకులు, వియర్లు, షట్టర్లు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పునర్నిర్మాణం, మరమ్మతులు సాగునీటి కాలువల నిర్వహణలో అత్యవసర పనులకు నీలినీడలు కమ్ముకున్నాయి. ఏటా వేసవిలో ఓఅండ్ ఎం నిధులతో పనులు జరుగుతుంటాయి. దీనికి సంబంధించి ప్రతిపాదనల జాబితా నాలుగు నెలల కిందటే రూపొందించినా నేటికీ ఆమోదం లభించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పశ్చిమడెల్టాలో ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం సబ్ డివిజన్ల పరిధిలో 11 ప్రధాన పంట కాలువలు ఉన్నాయి. 4.60 లక్షల ఎకరాల విస్తీర్ణానికి కాటన్ బ్యారేజీ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నారు. డెల్టాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యేది వరి. సాధారణంగా ఓఅండ్ఎంలో అత్యవసర పనులను ప్రతిపాదిస్తుంటారు. ఈ ఏడాది నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో రూ.17.14 కోట్ల అంచనా వ్యయంతో 166 పనులను ప్రతిపాదించారు. వీటిలో తూడు తొలగింపు, పూడికతీత, తారు, ఆయిల్‌పూత, ఎత్తిపోతలు, షట్టర్ల మరమ్మతులు, గట్ల పటిష్టీకరణ పనులు ఉన్నాయి. మరో 12 ఇతర పనులకు రూ.1.26 కోట్లు అవసరమని తేల్చారు. వీటికి ఇప్పటికే ఆమోదం లభిస్తే టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలయ్యేది.

వృథాగా పోతున్న సాగునీరు..

ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన లాకులు, సర్ ప్లస్ ఇయర్, అవుట్ పాల్ స్లూయిజ్‌లు, షట్టర్లు, శిథిలావస్థకు చేరాయి. వీటి పునర్నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. కాలువలపై షట్టర్లు సరిగా పనిచేయని చోట్ల సాగునీరు వృథాగా పోతోంది. రబీలో సుమారు 50 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాలువలో అవరోధాలు తొలగించేందుకు ఒఅండ్ఎం నిధులే కొంతమేర ఊరటనిస్తున్నాయి. నిధులు మంజూరు చేయలేదు.


పొట్టిలంక ఛానల్‌పై దెబ్బతిన్న షట్టర్

శిథిలావస్థలో లాకులు, షట్టర్లు..

వెంకయ్య వయ్యేరు, ఉండి పంట కాలువల పరిధిలోని అధిక శాతం లాకులు, షట్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కాలువల పరిధిలో షట్టర్లు దెబ్బతిన్న కారణంగా పూర్తిస్థాయిలో శివారు గ్రామాలకు నీరందడం లేదు. అధిక వర్షాలు, వరదల సమయంలో శిథిలావస్థకు చేరుకున్న షట్టర్లు, చెక్‌డ్యామ్ లేచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు పడిన సమయాల్లో అన్నదాతలు పడుతున్న వెతలు వర్ణనాతీతం. ఇరిగేషన్ శాఖ అధికారులు అత్యవసర పనులపై ఇప్పటికీ శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా కాలువల్లో తూడు గుర్రపుడెక్క, చెత్తా చెదారం తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అత్యవసర పనులకు ప్రతిపాదనలు పంపాం..

ఇరిగేషన్ ఇఇ ఎం.దక్షిణామూర్తి

నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో రూ.17.14 కోట్ల అంచనా వ్యయంతో 166 పనులను ప్రతిపాదించాం. కాలువలపై అవసరమైన పనులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైన తరువాత పనులు చేపడతాం. జూన్ మొదటి వారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తాం.

కేంద్ర మంత్రిగా వర్మ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర మంత్రి వర్గంలో జిల్లాకు మరోసారి చోటు దక్కింది. నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. తొలిసారి ఎంపీగా ఎన్నికైన వర్మకు కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గతంలో బిజెపికి చెందిన సినీ నటుడు కీర్తిశేషులు యువి.కృష్ణంరాజు నరసాపురం ఎంపీగా బాధ్యతలు నిర్వహిస్తూ కేంద్ర మంత్రి పదవి చేపట్టారు. 2014 ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా బిజెపికి చెందిన గోకరాజు రంగరాజు ఎన్నికయ్యారు. రాష్ట్రం నుంచి బిజెపి తరపున ఎంపీలుగా ఎన్నికైన వారిలో పురంధేశ్వరి, సిఎం రమేష్ వంటి సీనియర్లు ఉన్నప్పటికీ వారందరినీ పక్కన పెట్టి వర్మకు కేంద్ర మంత్రి మండలిలో చోటు ఇవ్వడం గమనార్హం. శ్రీనివాసవర్మ బిజెపి జిల్లా అధ్యక్షులుగా పనిచేసి తరువాత రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. ఆయనకు భీమవరం మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.


భూపతిరాజు శ్రీనివాసవర్మ



నిరసన తెలుపుతున్న కార్మికులు

కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల నిరసన దీక్షలు

సమస్యను పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - గణపవరం

మూడు రోజులుగా ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, తమను అన్యాయంగా తొలగించిన ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎఫ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఫ్యాక్టరీ వద్ద కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు మూడో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నష్టాల బాటలో ఉందనే వంకతో కార్మికులను బయటకు నెట్టడం దారుణమన్నారు. కనీసం తమతో గానీ, జిల్లా లేబర్ అధికారులతో గానీ తమ సమస్యలపై చర్చించకుండా గేట్లకు తాళం వేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే వేతనాల్లేక తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, జిల్లా అధికారులు వెంటనే కలుగజేసుకొని సమస్యను పరిష్కరించాలని, మరలా ఫ్యాక్టరీ తెరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కరించే వరకూ వివిధ దశల్లో పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వై.రామకృష్ణ, ఏసుబాబు, జి.శ్రీనివాసరాజు, బి.రాధాకృష్ణ, ఎస్.రమణ, డి.సాయికృష్ణ పాల్గొన్నారు.

కొల్లేరు సమస్య పరిష్కారమయ్యేనా..!

వలస బాటలో కొల్లేటి ప్రజలు


నేతలిచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతున్న వైనం

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తాం.. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ఉపాధి కల్పిస్తాం.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి కొల్లేరు ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తాం అని నేతలు ఎన్నికల సందర్భంగా హామీలివ్వడం, ఆపై మరవడం సర్వసాధారణమైంది. కొల్లేరుకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి అక్కడి ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా చూస్తామని పదేళ్ల క్రితం భీమవరం సభలో అప్పటి ప్రధాని అభ్యర్థి మోడీ హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకొచ్చి పదేళ్లయ్యింది. మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పదేళ్లలో కొల్లేరు సమస్య పరిష్కారానికి ఎటువంటి ముందడుగూ పడలేదు. కొల్లేరు సమస్య పరిష్కారం కావాలంటే బిజెపిని గెలిపించాలని కైకలూరు సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ప్రస్తుతం కొల్లేరు ఎక్కువగా విస్తరించి ఉన్న కైకలూరు నియోజకవర్గంలో బిజెపి, ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన, దెందులూరు, ఉండి నియోజకవర్గాల్లో టిడిపి ఎంఎల్ఎలే ఉన్నారు. మరి ఈ ఐదేళ్లలో కొల్లేరు సమస్యను ఏ మేర పరిష్కరిస్తారో వేచిచూడాలి.

కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఇప్పటివరకూ నేతలిచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోకపోవడంతో అక్కడి ప్రజలు జీవనానికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్లేరు ప్రాంతంలో జీవనోపాధి లేక బతుకుదెరువు నిమిత్తం కొల్లేరు ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తోంది.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొల్లేరు సరస్సు మండవల్లి మండలంలో కొంతమేర విస్తరించి ఉంది. కొల్లేరుపై ఆధారపడి సుమారు 15 గ్రామాల్లో సుమారు 16 వేల మంది జీవిస్తుంటారు.



రెగ్యులేటర్ లేకపోవడంతో నిరంతరం సముద్రంలోకి నీరువెళ్లిపోవడంతో వేసవిలో ఎడారిని తలపిస్తూ ఉంటుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మోడీ భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని కొల్లేరు ప్రాంత ప్రజలకు వరాల జల్లులు కురిపించారు. రెగ్యులేటర్ నిర్మిస్తామని, కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని అదనంగా కొట్టేసిన 7,500 ఎకరాలను అందించి సొసైటీలను పునరుద్ధరిస్తానని వరాల జల్లు కురిపించారు. ఆ ఎన్నికల్లో కేంద్రంలో మోడీ అధికారం చేపట్టగా కైకలూరు ఎంఎల్ఎగా కామినేని శ్రీనివాసరావు అధికారాన్ని చేజిక్కించుకున్నారు. నేటికీ పదేళ్లు గడుస్తున్నా కొల్లేరు ప్రాంతప్రజలకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారని కొల్లేరువాసులు పెదవి విరుస్తున్నారు. అంతేకాకుండా ఎకో సెన్సిటివ్ జోన్‌లోకి కొల్లేరును తీసుకొచ్చి గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేయించే పరిస్థితి తీసుకొచ్చారనే విమర్శలు ఉన్నాయి. కొల్లేరును అభివృద్ధి చేస్తామని హామీలు గుర్తించి ఎకో సెన్సిటివ్ జోన్ తీసుకురావడం ఎంతవరకూ సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

ఏళ్ల నుంచి కొల్లేరుపై ఆధారపడి జీవనం సాగించే ఇక్కడ ప్రజలు ఇంకెక్కడికి వెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా పలు పార్టీలు రాజకీయంగా కాకుండా కొల్లేరును, కొల్లేరు ప్రాంత ప్రజలను, గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా చర్యలు తీసుకుని వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కొల్లేటి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తక్షణం కొల్లేరులో రెగ్యులేటర్ నిర్మించాలి

ఎల్ఎస్.భాస్కరరావు, సామాజిక వేత్త

కొల్లేరు అభివృద్ధితోనే ఆ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. అందుకోసం తక్షణం రెగ్యులేటర్‌ను నిర్మించాలి. రెగ్యులేటర్ లేకపోవడం వల్ల జనవరిలోనే కొల్లేరు ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. అందువల్ల కొల్లేటి ప్రాంత ప్రజల జీవన భృతి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. హామీలు నెరవేర్చి కొల్లేరును అభివృద్ధి చేసి కొల్లేటి ప్రాంత ప్రజలను ఆదుకోవాలి. కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి.

కొల్లేరును ఓటు బ్యాంకుగా పరిగణించడం తగదు

తెంటు అప్పారావు,

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు

కొల్లేటి ప్రాంత ప్రజలను ఓట్ల కోసం వినియోగించుకుని అభివృద్ధిని గాలికి వదిలేయడం సరికాదు. ఓటు బ్యాంకుగా కాకుండా అభివృద్ధి చేస్తే కొల్లేరు ప్రాంత ప్రజలతో పాటు కైకలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుంది. రాజకీయ నాయకులు ఆ విధంగా ఆలోచించి అభివృద్ధి చేయాలి.


సత్తిరాజు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

వ్యకాస నేత సత్తిరాజు కన్నుమూత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక ఉద్యమ నేత కూనపరాజు సత్యనారాయణరాజు (80) ఆదివారం ఆయన స్వగృహం వద్ద కన్నుమూశారు. ఆయనకు భార్య సత్యవతి, కుమారుడు సుందరయ్య ఉన్నారు. ఆయన తుదిశ్వాస వరకూ సిపిఎం కార్యకర్తగా పనిచేశారు. భార్య సత్యవతితో వ్యవసాయ కార్మికుల జీవనగతులు పెంచడానికి నిత్యం పోరాటం చేశారు. ఆయన మృతదేహంపై రైతు సంఘం ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామూర్తి, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, సిపిఎం సానుభూతిపరులు కెవి.సీతారాం, టి.కోటేశ్వరరావు, సిపిఎం నేతలు పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి గోపాలన్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. సత్తిరాజు సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా, నర్సాపురం, పాలకొల్లు డివిజన్ కమిటీ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకునిగా అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేశారని పేర్కొన్నారు. గ్రామంలో పేదలు, రైతులు, కౌలు రైతులు, ప్రజల సమస్యలపై విశేష కృషి చేశారని తెలిపారు. భార్య సత్యవతి సిపిఎం సభ్యురాలిగా, మహిళా సంఘం నాయకురాలిగా మహిళల సమస్యలపై కృషి చేశారని పేర్కొన్నారు. ఇరువురు సాధారణ జీవితంతో గ్రామంలో అందరి మన్ననలూ పొందారన్నారు. సత్యనారాయణ రాజు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో కాలికి సర్జరీ జరిగి చాలా ఇబ్బంది పడి కోలుకుంటున్న తరుణంలో ఆకస్మికంగా మృతి చెందారని తెలిపారు. ఆయన మృతి సిపిఎం పార్టీకి, ప్రజా సంఘాలకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. సత్తిరాజుకు సిపిఎం జిల్లా కమిటీ తరపున ఘనంగా నివాళులర్పించారు. భార్య సత్యవతికి, కుమారుడు సుందరయ్యకు, కుటుంబ సభ్యులకుసానుభూతి తెలిపారు.

అనంతరం రైతు సంఘం ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామూర్తి, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, సిపిఎం సానుభూతిపరులు కెవి.సీతారాం, టి.కోటేశ్వరరావు, ఆయన వ్యవసాయ కార్మిక ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతదేహం వద్ద పలువురు విలపిస్తూ ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. సాయంత్రం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు.

సిపిఎం సంతాపం..

సత్యనారాయణరాజు (సత్తిరాజు) మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్), సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, సీనియర్ నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి, కేతా సూర్యారావు, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు సంతాపం తెలిపారు.

అలాగే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం..

సత్తిరాజు మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిహెచ్.సోమేశ్వరరావు, కె.బలరాం, టి.కోటేశ్వరరావు, తిరుమల రాజు, వలవల రవి ఉన్నారు.

సత్తిరాజుతో తమ పోరాటాలు, అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుని ఐద్వా నేతలు కన్నీటిపర్యంతమయ్యారు. ఐద్వా పట్టణ కార్యదర్శి బాసిన శ్యామల, దోర రత్నం, ఏలూరి సీత, సీతామహాలక్ష్మి సంతాపం తెలిపారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తిరుమల విద్యార్థుల విజయభేరి

ఆల్ ఇండియా 62 ర్యాంకు, 193వ ర్యాంకు, 242వ ర్యాంకు, 440వ ర్యాంకుల సాధన

10000 లోపు ర్యాంకులు సాధించిన 53 మంది

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన జెఇఇ అడ్వాన్స్ 2024 పరీక్షా ఫలితాల్లో భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను కనబరిచారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఆదివారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. జెఇఇ అడ్వాన్స్ నిర్వహించిన ఐఐటి మద్రాసు ఆదివారం ర్యాంకులు విడుదల చేయగా, అందులో వివిధ కేటగిరిల్లో కెఎస్‌టి.అనురూప్ రెడ్డి ఆల్ ఇండియా - 62వ ర్యాంకు, వి.రామ్ చరణ్ వర్మ - 193వ ర్యాంకు, డి.సాయి సత్య - 242వ ర్యాంకు, సిహెచ్.శ్రవణ్ శ్రీసత్య - 440వ ర్యాంకు, బి.సత్య అఖిల్ రాజీవ్ - 582వ ర్యాంకు, ఎమ్.ఆదిత్య సాయి నాయుడు - 689వ ర్యాంకు, ఎస్ఎస్.దేవి శ్రీనివాస్ - 713వ ర్యాంకు, టి.కృష్ణ తేజ - 803వ ర్యాంకు, పి.చక్రి వర్మ - 911వ ర్యాంకు సాధించారని, అల్ ఇండియా 500 లోపు ర్యాంకులు సాధించిన వారు 4 గురు, 1000 లోపు 9 మంది, 1500 లోపు 14 మంది, 3 వేల లోపు 27 మంది, 5 వేల లోపు 42 మంది, 10 వేల లోపు 53 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని సంస్థ డైరక్టర్స్ ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాస వర్మ, జి.సతీష్ బాబు తెలియజేశారు. సుమారు 30 మందికిపైగా విద్యార్థులు కేవలం భీమవరం బ్రాంచి నుంచే ఐఐటి కళాశాలలో అడ్మిషన్లు సాధించగలరని తెలియచేస్తూ, ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు, సహాకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.




విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు

కేజ్ కల్చర్‌తో తక్కువ ఖర్చు, అధిక దిగుబడి

ప్రజాశక్తి - నరసాపురం

చేపల పెంపకంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని పొందేందుకు కేజ్ కల్చర్ బాగా ఉపయోగపడుతుందని విశాఖపట్నం సిఎంఎఫ్ఎస్ఐ హెడ్, ప్రిన్సిపల్ జో కె.కిలాకుడేన్ అన్నారు. ఆదివారం నరసాపురం మండలం కొత్త నవరసపురం గ్రామంలో కేజ్ కల్చర్ రైతు దిగుబడిని కిలాకుడేన్ బృందం పర్యవేక్షించింది. ఈ సందర్భంగా కిలాకుడేనే మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఆక్వా పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర మత్స్య సంపద పరిశోధన సంస్థ(సిఎంఎస్ఆర్ఎ) మారుతున్న కాలానికి అనుగుణంగా చేపల పెంపకంలో కూడా ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని పొందేందుకు కేజ్ కల్చర్ బాగా ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే ఈ విధానం ద్వారా ఎంతోమంది మంచి దిగుబడులను పొందుతున్నారన్నారు. షెడ్యూల్ కులాల ఎస్‌సిఎస్‌పి ఇండియన్ పంపానో(ముక్కుడు పార) సముద్ర జాతికి చెందిన చేపలను గోదావరిలో పెంచామన్నారు. ఈ చేపలు విశాఖపట్నం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయన్నారు. నర్సాపురం కొత్త నవరసపురానికి చెందిన గంధం వెంకటేశ్వరరావు అనే వ్యక్తి సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సిఎంఎస్ఆర్ఎ) సహకారంతో గోదావరిలో హెు కేజ్ కల్చర్ విధానానికి శ్రీకారం చుట్టి మంచి లాభాలను పొందారన్నారు. సిఎంఎఫ్ ఆర్ఐ సైంటిస్ట్ శేఖర్ మెగారాజన్, నర్సాపురం ఫీల్డ్ సెంటర్ అధికారి పంచకర్ల నాగరాజు ఆధ్వర్యంలో గత జనవరి నెలలో రెండు యూనిట్లలో హెు 20 గ్రాముల 2500 చేప పిల్లను వేశామని వాతావరణ పరిస్థితులు దృష్ట్యా నేడు పట్టుబడి పనులు చేపట్టామని అన్నారు. అయినప్పటికీ సుమారు 400 గ్రాముల పరిణామంతో చేప పిల్ల ఎదిగి మంచి లాభాలను ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఓడలరేవు, పెద్ద పాలెం, చిన్న గొల్ల పాలెం, లక్ష్మీపురం, నాగయ లంకలలో ఈ పెంపకం జరుగుతాయన్నారు. కొత్త నవరసపురంలో కొత్తగా రెండు యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. కాలానుగుణంగా కేజ్ కల్చర్‌కు మంచి ఆదరణ లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వంశీ, సురేష్ పాల్గొన్నారు.




కేజ్ కల్చర్‌పై అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు


వృద్ధురాలికి చికిత్స చేస్తున్న వైద్యులు

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికి వైద్యం కార్యక్రమంలో భాగంగా ఇంటికే పరిమితమై అనారోగ్యంతో ఉన్న వృద్ధులకు సంచారశకటం ద్వారా వైద్యులు ఆదివారం ఉచిత వైద్యసేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలిమాహేంద్ర, డాక్టర్ సాయిబాబా తణుకు, చివటం ప్రాంతాల్లో పర్యటించి సుమారు ఐదుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. డాక్టర్ కెవి రావు ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ అమెరికా వారి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిన రామచంద్రరావు జన్మదిన సందర్భంగా వారి నివాసంలో సంఘం తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, సంఘం కోశాధికారి అర్టి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్యసేవలు కోరువారు స్వయంగా గాని, లేదా 9985343530 నెంబర్‌కి సంప్రదించవచ్చన్నారు.


మొగల్తూరు : నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనాడు సంస్థ అధినేత చెరుకూరి రామోజీరావు మృతి పట్ల ఎపిడబ్ల్యూజె ఆచంట నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆదివారం మార్టేరు సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఎపిడబ్ల్యూజె ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు జక్కంశెట్టి శ్రీనివాస్, ఆచంట నియోజకవర్గ ఎపిడబ్ల్యూజె అధ్యక్షులు గుర్రాల శ్రీనివాస్, 99 టివి ముత్యాల షణ్ముఖ, బిగ్ టివి రామకృష్ణారెడ్డి, ఈనాడు నరేష్, విశాలాంధ్ర టివి రాజు, ప్రజాశక్తి ఎన్‌కె.నాగేశ్వరరావు, హెచ్‌ఎం టివి అబ్రహం, హేలాపురి గంగోలు విజయ్, వార్త భూషణం, ఈనాడు శ్రీనివాస్, ఈనాడు హనుమంతు, ఆంధ్రజ్యోతి సతీష్ తదితర మీడియా మిత్రులు పాల్గొని, నివాళులు తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న టిడిపి నాయకులు ఆదివారం ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రామోజీ రావు సంస్థలు నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, మూలస్వామి, కోటేశ్వరావు, నాగేశ్వరావు, బుల్లయ్య, బంధన విజయకుమార్, కొప్పాడి పెద్దిరాజు, పెద్ద సింగ్ నాగేశ్వరరావు ఉన్నారు.

సొసైటీ ఛైర్‌పర్సన్, డైరెక్టర్లు రాజీనామా

ప్రజాశక్తి - ఆచంట


రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

2024 సాధారణ ఎన్నికల్లో వైసిపి ఓటమి పాలైన నేపథ్యంలో వల్లూరు సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్ నారిన వీర వెంకట సత్యనారాయణ, డైరెక్టర్లు గంగోలు శ్రీనివాసరావు, పిచ్చెట్టి సత్యనారాయణలు ఆదివారం తమ పదవులకు రాజీనామా చేసి సొసైటీ కార్యదర్శి ఏడిద వెంకటకృష్ణారావుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఈ రాజీనామా పత్రాలను భీమవరం డిసిసిబి కార్యాలయంలో అందజేస్తామని తెలిపారు.

దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కె.గంగవరం మండలం, ఎర్రపోతవరం లాకుల వద్ద భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత మహాసభ రాష్ట్ర నాయకులు చింతపల్లి గురు ప్రసాద్, అంబేడ్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ పార్టీల ముసుగులో అంబేడ్కర్ విగ్రహాలను అవమాన పరుస్తుంటే దళిత సమాజం చూస్తూ ఊరుకోవడం జరగదని వారన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహన్ని అవమాన పరచిన సంఘటనలో పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్పందించాలని, పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నాయకర్‌ను కలిసిన చాగంటి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఎగా ఎన్నికైన బొమ్మిడి నాయకర్‌ను జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్న) ఆదివారం అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్‌ఎగా భారీ మెజారిటీతో గెలిచినందుకు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నరసాపురంలో జనసేన పాత్ర గురించి చర్చించారు. జనసేన, టిడిపి, బిజెపి సమిష్టిగా కృషి చేయడంతో ఈ గెలుపు సాధ్యమైనందన్నారు. టిడిని, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, నియోజకవర్గ ప్రముఖులు నాయకర్‌ను అభినందించారు.

నేరాలు - ఘోరాలు

బ్రిడ్జిపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా చోటుచేసుకుంది. ఆగర్తి పాలెం గ్రామానికి చెందిన వీరవల్లి దుర్గారావు(30) శనివారం సాయంత్రం చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త ఆదివారం ఉదయం గ్రామస్తులకు తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దుర్గారావుకు భార్య ఉంది. పిల్లలు లేరు. తాపీ పని చేస్తూ ఉంటాడు. భార్య వాలంటీర్‌గా పనిచేస్తుంది. చిన్న చిన్న కుటుంబ కలహాలతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అని , తన పని తాను చేసుకుంటూ అందరికీ సహాయం చేసే మంచి వ్యక్తి అని, ఆదివారం ఉదయం నుంచి చించినాడ బ్రిడ్జి వద్ద గోదావరిలో మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.



చింతచిగురు ధరకు రెక్కలు..!

కేజీ రూ.500

ప్రజాశక్తి - నరసాపురం


చింతచిగురు..

గోదావరి ప్రజలు రుచుకి ఇచ్చే ప్రాధాన్యత శుచికి కూడా ఇవ్వరనే విషయం విదితమే. పశ్చిమగోదావరి వాసులు అతిథులకు మర్యాద ఇవ్వడంలో వారికి సాటి లేరు. సీజన్ బట్టి రకరకాల వంటకాలు వండుతూ బంధువులకు పెడతారు. వేసవి అనంతరం వర్షాలు కురిసే సమయానికి పాత ఆకులు రాలి చింత చెట్టుకు కొత్త ఆకులు వస్తాయి. వీటిని చింతచిగురు, చింతాకు అని పిలుస్తారు. చింతాకు ఇప్పుడు సీజన్ అని చెప్పవచ్చు. ప్రస్తుతం వారాంతపు సంత, రోజువారీ మార్కెట్, ఇంటింటికీ వీధి వ్యాపారులు తీసుకొచ్చే వారి దగ్గర దొరుకుతుంది. 100 గ్రాముల చింతాకు రూ.50 ధర పలుకుతుంది. గతంలో రూ.20కి వచ్చే చింతాకు ధర అమాంతం పెరిగిపోయింది. కేజీ చింతాకు మార్కెట్‌లో రూ.500 పలుకుతుంది. చింతాకు రుచి తెలిసిన వారు ధర ఎంతైనా పెట్టి కొంటున్నారు. చింతాకును మాంసాహారులు చింతాకు పచ్చి రొయ్యలు, చింతాకు ఎండి రొయ్యలు, చింతాకు మటన్, చింతాకు బోటి, చింతాకు చికెన్, చింతాకు కట్టె పరుగులు, చింతాకు చిన్ని చేపలతో వంటకాలు వండుతారు. శాఖాహారులు అయితే పప్పు చింతాకు, చింతాకు పులిహోర వండుకుంటారు. చింతాకు పుల్లగా ఉండటం వల్ల భోజన ప్రియులు చింతాకు చేసే ఏ వంటకాన్ని అయిన ఇష్టపడతారు. పంట కాలువలో దొరికే చేదు పరుగులు అనే చేపలతో చింతాకు వేసి వండేవారు. ఇప్పుడు వ్యవసాయంలో పురుగు మందులు వాడటం వల్ల ఆ చేపలు దొరకడం లేదు. గత కొన్నేళ్ల క్రితం గ్రామాల్లో చింత చెట్లు ఉండేవి. రోడ్డు విస్తరణ, రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బకు చింత చెట్లు తొలగించేశారు. ప్రస్తుతం ఉన్న చెట్లు ఎక్కి చింత చిగురు కోసే వాళ్లు కరువు అవ్వడంతో చింత చిగురుకి డిమాండ్ పెరిగింది. వివాహాది శుభకార్యాలకు, హోటల్లో చింత చిగురుతో సరికొత్త వంటకాలు రెడీ చేస్తున్నారు. యూట్యూబ్ వీడియోలు చూసి సైతం వంటకాలు రెడీ చేస్తున్నారు. చింతాకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. తినడం వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది. పైల్స్ ఉన్నవారికి చింతచిగురు చాలా మేలు చేస్తుంది. ఈ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకులను తినడం వల్ల గుండె జబ్బులు వంటి ఇతర ప్రమాదకరమైన అనారోగ్యాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. డయాబెటిస్ ఉన్న వారికి చింతచిగురు చాలా మేలు చేస్తుంది. దీన్ని తినడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. దీనిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. వీటిని తినడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. పిల్లలకు తినిపించడం వల్ల వారికి ఆరోగ్యానికి మంచిది. థైరాయిడ్ సమస్య ఉన్న వారు చింత చిగురుతో చేసిన వంటకాలు తినడం వల్ల వారికి తగ్గే అవకాశం ఉందని ప్రచారం. చెడు ఉందన్నా తినే ప్రజలు ఇంత మంచి జరుగుతుంది అంటే అస్సలు వదలరు. ఇంక తెగ లాగించేస్తున్నారు.


చేపలు దిగుమతైన అనంతరం చెత్తతో ఉన్న టబ్‌లు, లారీని కడుగుతున్న వ్యాపారి


చేపలు, రొయ్యల చెరువుల నుంచి విడుదల చేసిన కుళ్లిన నీరుతో కాలువ

వెంకయ్య కాలువలో చెత్తాచెదారం..!

తాగునీరు వదిలితే ప్రమాదభరితం
ప్రక్షాళన చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక వెంకయ్య కాలువ కుళ్లిన చెత్తాచెదారంతో నిండిపోయింది. కాలువ గట్టు పొడవునా మొత్తం దుర్గంధపూరితంగా తయారైంది. ఇదే దశలో కాలువలోకి చేపల చెరువులు, రొయ్యల చెరువులలో ఇటీవల వాతావరణ తేడాతో చేపలు, రొయ్యలు కుళ్లిన నీరు వదిలేశారు. మరో నాలుగు రోజుల్లో కాలువలోకి గోదావరి నీళ్ల వదలబోతున్నారు. కాలువ శుభ్రం చేయకుండా నీరు వదిలితే రోగాలు సంభవించే ప్రమాదం ఉందని కాలువ నీరు తాగే వేలాదిమంది వాపోతున్నారు. మండలంలో వెంకయ్య కాలువ, పెదకాపవరం వద్ద ప్రారంభమై ఆకివీడు మీదుగా అయిభీమవరం, చేరుకుమిల్లి, కాళ్ల మండలం ఏలూరుపాడు వరకు చేరుతోంది. మండలంలోని 16 గ్రామాల ప్రజలు పూర్తిగా ఈ నీటిపైనే ఆధారపడి ఉన్నారు. ఈ వెంకయ్య కాలువ నీరే సాగు, తాగుకి వినియోగిస్తారు. గతంలో వర్షాకాలం వస్తే కాలవలో నీరు పూర్తిగా ఎండిపోయేవి. ఆ సమయంలో ఉన్న పసర్లు, మట్టి పూర్తిగా ఎండి మట్టిలో ఉన్న పనికిరాని సూక్ష్మ క్రిములు పోయి మట్టి స్వచ్ఛంగా తయారైంది. తిరిగి వానలు రాగానే కొత్త నీరు వదిలేవారు. వాన నీరు కొత్తనీరు కారణంగా ఆరోగ్యాలు కొద్ది మాత్రం తేడా వచ్చినా పెద్ద ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఇప్పుడు చేపల చెరువు, రొయ్యల చెరువులలో కుళ్లిన నీటితో పాటు మరిన్ని చెత్తాచెదారాలు ఇక్కడికి వచ్చి చేరాయి. వీటితోపాటు కాలువ గట్టునున్న నివాసాలన్నీ మల, మూత్ర విసర్జనశాలల నుయ్యిలు కాలువకు అంగుళం దూరంలో తవ్వారు. పేరుకు దూరంగా ఉన్నా ఆ కల్మషం కాలవ నీటిలోనే ఉంటుంది. ఈ నీరు మొత్తం 16 గ్రామాల ప్రజలు తాగుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అంచనా వేసుకోవచ్చు. వెంకయ్య కాలువ నీరు తాగితే పక్షవాతం, క్యాన్సర్లు వస్తాయని గతంలో కేంద్ర జలవనరుల శాఖ అధికారులు, సాంకేతిక నిపుణులు శాస్త్రీయ పరిశోధనలతో తేల్చి చెప్పారు. అయినా అధికారుల విధానంలో మార్పు లేదు. ప్రజా ప్రతినిధులు ఓట్లే ప్రధానంగా పట్టించుకోరు. ఇక సామాన్యుడి దాహం తీరేది ఎలాగో.. ఈ అంశాలు దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికైనా కొత్తనీరు వదిలే ముందు కాలువని ఒకసారి ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు. ముందు రెండు రోజులు నీరు వదిలి వాటిని లాకులు వేసి వదిలేసి తిరిగి వదిలితే కొంతవరకు కాపాడవచ్చు అని ప్రజలు వేడుకొంటున్నారు.

వామ్మో.. ఇది రోడ్డా..!

మట్టి తరలింపుతో అధ్వానంగా మారిన వైనం
ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - నరసాపురం


మట్టిరోడ్డును తలపిస్తున్న ఆర్‌అండ్‌బి రహదారి

ఈ రోడ్డు మట్టి రోడ్డు అనుకుంటే పొరపాటే. ఆర్ అండ్ బి తారు రోడ్ సైతం మట్టి మాఫియా దెబ్బకు మట్టి రోడ్డు మాదిరిగా మార్చేశారు. నరసాపురం మండలం ఎల్‌బి చర్ల నుంచి పిఎం లంక వెళ్లే రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. రోడ్డుపై విస్తరణ పనులకు ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా గత 20 రోజులుగా తరలిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు తావు తీస్తుంది. వేసవి కావడంతో వరి చేల్లోని సారవంతమైన మట్టిని ఇసుక మాఫియా దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోడ్డు పనులకు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, నాసిరకం మట్టిని రోడ్డు పనులకు వాడేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం నిబంధన పాటించకుండా మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. బరకం సైతం కప్పకుండా మట్టి తరలిస్తున్నారు. మట్టి గిరాకీ ఉండడంతో ఎటువంటి అనుమతులు లేకుండా దూర ప్రాంతాలు సైతం తరలిస్తున్నారు. ఈమధ్య కురిసిన వర్షాలకు కొద్దిపాటి చినుకులకు రోడ్డుపై పెరిగిపోయిన రాగిడి మట్టికి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వేములదీవి నడిచి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాల్లో మట్టి ఉండిపోయి రోడ్లపై ప్రమాదాల బారిన పడ్డా ప్రయాణికులు చాలామంది ఉన్నారు. రోడ్లపై పనులు చేపట్టినప్పుడు దారి మళ్లించుకోవాలని బోర్డు సైతం ఏర్పాటు చేయలేదు. అక్కడ వరకూ వచ్చి బండి ముందుకెళ్లాక మధ్యలో ఉండిపోయి ఏం చేయాలో తెలీక వాహనదారులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని తీర ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.


కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం

భీమవరం టౌన్: ఇండియా వేదిక ఆధ్వర్యంలో ఎన్నికల్లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మీడియా మిత్రులకు కాంగ్రెస్ భీమవరం నియోజవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విశేష సేవలు అందించిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతం కావడానికి కృషిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు పేరు పేరునా ధన్యవాదాలు, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. అధికారం చేపట్టిన టిడిపి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, ముఖ్యంగా భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని, యనమదుర్రు వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలని వెంటనే టిట్కో గృహాల సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు అందించే కార్యక్రమం చేపట్టాలన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అండగా నిలబడాలని, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో సేవలందించిన ప్రజలందరికీ, సిపిఎం, సిపిఐ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోము నాగ కేశవ్ బాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - వీరవాసరం


1986-87 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వపు విద్యార్థులు

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ అపూర్వ కలయికకు వేదికైంది. 1986-87 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వపు విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సుమారు ముప్పై నాలుగు సంవత్సరాల తరువాత కలుసుకున్న నాటి విద్యార్థులు భావోద్వేగాలను పంచుకుంటూ ఒక రోజంతా గడిపారు. నాటి తరగతి గదులలో పంచుకున్న విశేషాలను, ఆనాటి గురుతులను నెమరువేసుకుంటూ ఒకరినొకరు కులాస ప్రశ్నలు వేసుకుంటూ ఒక మధురానుభూతిని పొందారు. ఈ అపూర్వ కలయికకు 2018లో ఈ బ్యాచ్‌కు చెందిన వలవల జానకీరామ్ ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి నాంది పలికాడు. దీనిని స్థానికంగా ఉండే ముద్రగళ శ్రీనివాస్, యేలూరి భానుకుమారి, మల్లుల జైకృష్ణ, శనివారపు ప్రసాదు, నిమ్మల దుర్గ అందిపుచ్చుకుని పూర్వపు విద్యార్థుల చిరనామాలు తెలుసుకోవడం ద్వారా వీరి కలయిక సాధ్యమైంది. ఎంతో ఉల్లాసభరతంగా గడిపిన వీరు అనేక తరాలకు సుపరిచుతుడైన అప్పటి స్కూల్ స్వీపర్ మద్దాల రామకృష్ణను సత్కారించి రూ.ఐదు వేలు నగదు బహుమతి అందజేశారు. వచ్చే సంక్రాంతికి మరోసారి కలుసుకుని తమ గురువులను సత్కారించుకోవాలనే తలంపుతో భారమైన మనసుతో వెనుదిరిగారు.

శ్రీనివాస్‌వర్మకు కేంద్ర మంత్రి పదవిపై హర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు


పాలకొల్లు : కేక్ కట్ చేస్తున్న మిత్ర పక్షాల నేతలు

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ముచ్చటగా మూడవ సారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పిఎం నరేంద్ర మోడీకి విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. నర్సాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా కూడా విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో మిత్ర పక్షాల నేతలు కొల్లి నరసింహమూర్తి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, బోడ కనకరాజు, పిచ్చేడు శేఖర్, మల్లవోలు సురేష్, అడ్డాల మూర్తి, మల్లికార్జున్ రెడ్డి, చందాని లక్ష్మీనారాయణ, నంద అప్పలస్వామి, బైల శ్రీధర్, పాతపాటి గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు: నరసాపురం కోడలు నిర్మలా సీతారామన్ మూడో పర్యాయం మంత్రి పదవి, నరసాపురం ఎంపీగా ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు మంత్రి పదవి వరించడం పట్ల ఆదివారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాళీపట్నం సర్పంచి మేడిది సౌజన్య ప్రభాకర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు, జనసేన జిల్లా కార్యదర్శి మేడిది బాబ్జి, మాజీ సర్పంచి పడవల గంగరాజు తదితరులు హర్షం వ్యక్తం చేసిన వాళ్లలో ఉన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మకు మంత్రి పదవి కేటాయించడం పట్ల మండల బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

నరసాపురం: నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు కేంద్ర మంత్రి పదవి రావడం పట్ల కూటమి నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పెంటపాడు

మార్చి నెలాఖరుకే దాళ్వా కోతలు మొదలు పెట్టినా నేటికీ రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ కాలేదని రైతు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన రైతులతో ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం మండల అధ్యక్షులు కారక వెంకట్రావు, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కొంతమంది రైతులకు రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యానికి కొంతమందికే డబ్బులు పడ్డాయని, చాలామందికి డబ్బులు పడలేదని వారు తెలిపారు. రెండు నెలల 15 రోజులు సుమారు కావస్తున్న నేటికీ కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. ఈనెల ఒకటో తేదీన ఇరిగేషన్ అధికారులు పంట కాలువలకు నీటిని విడుదల చేశారని, ముందస్తుగా ఆకు మడులు పోసుకోవాలని ప్రకటనలు చేశారని వారు తెలిపారు. దాళ్వా ధాన్యం సొమ్ములు రైతు చేతికి రాక, దాళ్వా పెట్టుబడులు రాక అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు మరలా సార్వ సీజన్‌కు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాలంటే రైతుకి అప్పు దొరికే పరిస్థితి లేదని రైతు ఆవేదన వెళ్లబుచ్చారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమి పాలైందని, కొత్త ప్రభుత్వం ఈనెల 12న అధికారంలోకి వస్తుందని వచ్చిన వెంటనే రైతులకి రావాల్సిన బకాయిలు వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాలో వేసి వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా, సత్తి శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్.సత్యనారాయణ రెడ్డి, సత్తి కనికి రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

డిడిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

డిడిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్న శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఎన్‌జిఒ హాల్‌లో జరిగిన డెమో క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎం.శ్రీనివాసరావు డిడిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘానికి కట్టుబడి పని చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలల విలీనానికి సంబంధించిన జిఒ నెంబర్ 117 రద్దుచేసి, మూసివేసిన పాఠశాలలను పున: ప్రారంభించాలని కోరారు. ప్రాథమిక విద్యను మాతృభాషలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పిఎం ప్రమాణ స్వీకారానికి తరలిన పలువురు

ప్రజాశక్తి - పాలకొల్లు

వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రజా ఆశీర్వాదంతో మూడవసారి భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాలకొల్లుకు చెందిన బిజెపి కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి ఉన్నమట్ల కపర్తికి రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందింది. కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించిన నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మను ఆదివారం న్యూఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు ఆధ్వర్యంలో వీరు స్వయంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. పాలకొల్లు నుంచి బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావూరి సుధకు కూడా రాష్ట్రపతి భవన్ నుంచి పిఎం ప్రమాణ స్వీకారంకు ఆహ్వానం అందింది. ఆయన కూడా న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి పదవి పొందిన శ్రీనివాస్ వర్మను అభినందించారు.

ఉండిలో టిడిపి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో టిడిపి అభ్యర్థి కనుమూరి రఘురామ కృష్ణంరాజు విజయం సాధించడం గర్వించదగ్గ విషయమని ఉండి మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అన్నారు. ఆదివారం ఉండి మండలం వెలివర్రు గ్రామంలో టిడిపి నాయకులు ముదుండి సురేంద్ర వర్మ(ఎంఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న మంతెన రామరాజు మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి ఫలితంగానే ఉండి నియోజకవర్గంలో తిరుగులేని మెజార్టీని సాధించడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తకు ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుతో పాటు తాను కూడా అండగా ఉంటానని అన్నారు. విజయోత్సవ సంబరాలు అనంతరం సుమారు 2 వేల మంది టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలకు వీర పేరంటాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భోజన ఏర్పాట్లను ఎంఎస్ నిర్వహించారు.